రాయిపేటలో సమస్యల తిష్ట

- బొంగుతున్న డ్రెయిన్లు
- అధ్వానంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికారులు


పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా ఉన్న బీజీబీఎస్ మహిళా కళాశాల రోడ్డు


రాయిపేట డీఎస్పీ కార్యాలయం వద్ద అధ్వానంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో మౌలిక వసతుల సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేశామని చెప్పుకోవడమే తప్ప, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఏ విధంగా ఉందో రాయిపేటను చూస్తే అర్థమవుతుంది. పైగా పట్టణంలో రాయిపేటను ప్రధానమైన ప్రాంతంగా చెప్పుకుంటారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో డ్రెయిన్స్, పారిశుద్ధ్య సమస్యలు చాలా కాలంగా పరిష్కారం కావడం లేదు. ఇటీవల ఈ సమస్య మరింత తీవ్రమైంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వేధిస్తున్న డ్రెయిన్ల సమస్య

రాయిపేట మొత్తంగా ఎక్కడా కూడా డ్రెయిన్స్ సవ్యంగా లేవు. పూర్వం నిర్మించిన డ్రెయిన్లు శిథిలమయ్యాయి. అవుట్‌లెట్స్ సరిగ్గాలేవు. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. అదీకాక ఈ ప్రాంతంలో ఈ మధ్యకాలంలో ఒక్క మేజర్ డ్రెయిన్ కూడా కొత్తగా నిర్మించలేదు. మరోవైపు పాత డ్రెయిన్స్ లెవెల్స్ సరిగా లేకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ప్రతి డ్రెయిన్ లోనూ మురుగు, రోడ్డుమీదకు ప్రవహిస్తోంది. కొత్త డ్రెయిన్స్ నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఆర్డీఓ, డీఎస్పీనుంచి ఇతర ఉన్నతస్థాయి అధికారులు, బడా కాంట్రాక్టర్లు, పెద్దపెద్ద వ్యాపారులు అత్యధికంగా ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న పరిస్థితి మాత్రం దారుణంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. రాయిపేటలో ప్రతిచోటా 60 అడుగుల వెడల్పుతో విశాలమైన రోడ్లు ఉంటాయి. అయితే రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలు దర్శమిస్తుంటాయి. పైగా ఇటీవల రోడ్లపై పందులు సంచరిస్తున్నాయి. మరోవైపు కుక్కల బెడదతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. వీధిలైట్లు కూడా సవ్యంగా వెటగడంలేదు. రాత్రయితే దొంగల భయంతో వణికిపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రాయిపేటలో సమస్యలను పరిష్కరించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ మద్యం.. పేదల జీవితాలతో చెలగాటం


కర్రి గౌరీ సుభాషిణి

పెనుమంట్ర: దొంగ..దొంగ అంటూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం బెల్ట్ షాపులు ద్వారా నకిలీ మద్యం విక్రయిస్తూ మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. ఆదివారం ఆమె మార్టేరులో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇన్నాళ్లూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నకిలీ మద్యం విక్రయిస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందిందన్నారు. కానీ ప్రస్తుతం గ్రామాల్లో బెల్ట్ షాపుల పేరుతో కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ మద్యం ప్రియుల ప్రాణాలను హరిస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాన్ని నిజమని చెప్పి ప్రజలను నమ్మించి మోసం చేయలేరని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ దందాలకు ఎక్సైజ్ అధికారులతో పాటు కొన్ని ఎల్లో పత్రికలు, టీవీ చానల్స్ వత్తాసు పలకడం దురదృష్టకరమన్నారు. ప్రజలు ఇలాంటి అరాచకాలను గ్రహించి ప్రజలకు మేలు చేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపాలన్నారు.

అపూర్వ కలయిక


2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

యలమంచిలి: మండలంలోని ఇలపకుర్రు చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లర్లు, చిలిపి పనులు, సంఘటనలు జ్ఞాపకం చేసుకుని మురిసిపోయారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. మధ్యాహ్నం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై దాడి అమానుషం


అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై దాడి చేసిన విధంగా ఇటీవల సంఘటనలున్నాయని సీబీసీఎన్‌సీ రాష్ట్ర కార్యదర్శి, ఫీల్డ్ కౌన్సిల్ కార్యదర్శి గూడపాటి జోసఫ్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి అంటించిన సంఘటనతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసన వ్యక్తంచేస్తూ ఆదివారం స్థానిక ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకంచేసి, పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా అన్ని వర్గాలకూ ఆయన సమాన ప్రాతినిధ్యం కల్పించారన్నారు. అలాంటి వ్యక్తిని కించపరచే విధంగా పెట్రోల్ పోసి అంటించడం దారుణమైన సంఘటన అని మండిపడ్డారు. దీనిని ప్రతిఒక్కరూ ఖండించి, దుర్ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేయడం న్యాయవ్యవస్థను కించపరచడమేనన్నారు. న్యాయం, ధర్మాన్ని పరిరక్షించే న్యాయమూర్తులపై దాడి సహించరానిదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

15న బీఎస్ఐ సమావేశం

ఉండి: భీమవరంలో ఈ నెల 15న నిర్వహించే బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ)ఆకివీడు బ్రాంచ్ సమావేశానికి తరలిరావాలని బీఎస్ఐ నాయకులు బ్రదర్ ఈలి డేవిడ్‌మార్క్, బ్రదర్ జార్జ్‌ముల్లర్, బ్రదర్ జ్ఞానప్రకాష్ కోరారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2:30 గంటలకు భీమవరంలోని ఇండస్ట్రియల్ ఏరియాలోని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ చర్చ్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అగ్జిలరీ చైర్మన్ బ్రదర్ మేడిద జాన్సన్ హాజరవుతారని వివరించారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కల్తీ మద్యంపై నిరసన

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా నిర్వహిస్తున్నా చీమకుట్టినట్టు కూడా లేని కూటమి ప్రభుత్వ పోకడ అత్యంత దారుణమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం గుడాల గోపి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం సోమవారం పట్టణంలో కల్తీ మద్యంపై నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పాలకొల్లు బస్టాండ్ సెంటర్ నుంచి ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నాలని కోరారు.

ఐద్వా మహాసభలు జయప్రదం చేయాలి

నరసాపురం: నేటి నుంచి అనంతపురంలో మూడురోజులపాటు సాగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మూడేళ్ల కాలంలో మహిళా ఉద్యమ అనుభవాలు చర్చించి భవిష్యత్తు కార్య చరణను మహాసభల్లో రూపొందిస్తారని పేర్కొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10:30 గంటలు నుంచి అందించాలని కోరారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

యలమంచిలి: మండలంలోని నారినమెరక పంచాయతీ గమళ్లపెంటలో పేకాడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు ఆదివారం యలమంచిలి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 8140 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఈతకోట సత్యనారాయణ తెలిపారు.

ప్రతి విద్యార్థీ ఒక మొక్కను నాటాలి

భీమవరం: పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం ఎంతో అవసరమని, కాబట్టి ప్రతి విద్యార్థీ కనీసం ఒక మొక్క నాటి సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని భీమవరం శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్ అన్నారు. పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కాలేజీ ఆవరణలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

నకిలీ మద్యంపై పోరును విజయవంతం చేయాలి


సుంకర సీతారామ్

పెనుగొండ: నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఆచంట తహసీల్దారు కార్యాలయం వద్ద మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. నకిలీ మద్యాన్ని అరికటి ప్రజల ప్రాణాలను కాపాడడానికి వైఎస్సార్ సీపీ పోరాటం చేపట్టినట్లు వివరించారు. నకిలీ మద్యం ఏరులైపారుతున్నా సంబంధిత రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర కనీసం నోరు మెదపకపోవడం దురదృష్టకరమన్నారు. ఇదే పరిస్థితి ఆచంట నియోజకవర్గంలోనూ ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ మద్యం అమ్మకాలు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరుగుతున్నాయ ని ఆరోపించారు. వారికి కమీషన్లు కూడా అందుతున్నాయని ఆరోపించారు.

వైఎస్సార్ సీపీ వార్డు కమిటీ నియామకం


నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలని ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా తన సేవలందించాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. ఆదివారం పట్టణంలో 11వ వార్డులో వైఎస్సార్ సీపీ వార్డు కమిటీని నియమించారు. వార్డు ఇన్‌చార్జ్‌గా కోట రత్నరాజు, అధ్యక్షుడిగా తాడి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా మారుమూడి ఆనంద్‌రాజ్, కె.సురేష్, నక్కా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులుగా కాటం ప్రసాద్, వి.రాజ్‌కుమర్, రామేడి రాజేష్, మారుమూడి సుధారాణి, పరసాల చాందిని, కార్యదర్శులుగా బుడితి శ్రీను, మద్దా జాన్సన్, కడలి సతీష్, మగం బాబి, మేడవల దేవ, కార్యవర్గ సభ్యులుగా దీర కిరణ్‌కుమార్, చిలకపాటి చింటు, పోతమూడి ఉషా, కర్రి నారాయణమ్మ, విల్లూరి జీవన్ కుమార్, జీవన్, మాద్రు రాజు, నక్క శ్యామ్, కె.రాహుల్, నల్లి సాధిప్, గరికిముక్క చిన్ని తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కోరాడ శ్రీనివాస్, బండి రమేష్, మద్దా చంద్రకళ, ఖండవల్లి వాసు, జోగాడ ఉమామహేశ్వరరావు, రవి, రాజుసులోచన తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ నుంచే ఉద్యోగాలు చేసుకుంటే మంచిది


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు డిగ్రీ చదువుతున్న సమయంలోనే పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుంటే ఆ సొమ్ము విద్యకు ఉపయోగపడడమే కాకుండా తల్లిదండ్రులకు ఆసరాగా కూడా ఉంటుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవ వేడుకల్లో ఈ-క్లాస్ రూమును ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ చదువుతో పాటు స్థానికంగా ఉండే మెడికల్, ఇంజినీరింగ్ వర్క్ షాపుల్లో పని చేస్తే స్కిల్స్ పెరుగుతాయని అన్నారు. తద్వారా చదువు పూర్తయిన అనంతరం అటువంటి వ్యాపారాలు సొంతంగా కూడా పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో అకాల వర్షం


పెదపేటలోని హాస్టల్ ప్రాంగణంలో నిలిచిన నీరు


సంతపేటలో నీట మునిగిన రోడ్డు

ఆకివీడు: అకాల వర్షం ఆకివీడును అతలాకుతలం చేసింది. మధ్యాహ్నం వరకూ గ్రీష్మతాపానికి ప్రజలు అల్లాడిపోగా ఒక్కసారిగా వాతావరణం చల్లని గాలులతో సాయంత్రానికి కుండపోత వర్షం కురిసింది. దీంతో పలు వీధుల్లో డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. రోడ్లపై నీరు నిలబడింది. ఆదివారం కావడంతో ప్రజలకు అంత ఇబ్బంది కలుగలేదు. కుండపోత వర్షానికి స్థానిక పెదపేటలోని ఎస్సీ హాస్టల్ ప్రాంగణం నీటితో నిండింది. ఈ ప్రాంతంలో మట్టి వేసి ఎత్తు చేయాల్సి ఉంది. డ్రెయినేజీ నీరు, వర్షపు నీటితో ప్రాంగణం నిడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టాలి


భీమవరంలో సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

భీమవరం: రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టి, మద్యాన్ని ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తున్న షాపులపై తక్షణం చర్యలు తీసుకోవాలి సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బి.త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక మద్యం ఏరులై పారుతుందని మండిపడ్డారు. స్పిరిట్‌తో పేదవారే లక్ష్యంగా కల్తీ మద్యం తయారు చేసి విచ్చల విడిగా విక్రయాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీమద్యం విక్రయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. కల్తీ మద్యం తాగి ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఏర్పడిందని వెంటనే కల్తీ మద్యం అరికట్టే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే విస్తృతంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి ప్రజలతో బలవంతంగా మద్యం తాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నిధులు నిలుపుదల చేయడంతో హాస్పిటల్స్‌లో వైద్యం, సరైన సౌకర్యాలు అందట్లేదని, పేదలపై వైద్యం ఖర్చులు మరింత దారుణంగా పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో కల్తీ మద్యం అరికట్టకపోతే ఎక్సైజ్ ఆఫీసుల వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు, డి.నాగేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ రచ్చబండ


రచ్చబండ కార్యక్రమంలో సంతకాల సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


రాయకుదురులో కడలి ధర్మారావును పరామర్శిస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

వీరవాసరం: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కొనసాగుతోంది. మండలంలోని ఎం.పోలవరం, అండలూరు గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు అధ్యక్షతన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో వీరవాసరం మండల అధ్యక్షుడు చవ్వాకుల సత్యనారాయణ, మండల మాజీ కన్వీనర్ నేతల సుందరరాజు, మండల ఉపాధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు బి.శ్రీను, ఎం.శ్రీనివాస్, టి.చిట్టిబాబు, బి.పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ పార్టీ ఇన్‌చార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడు ఆదివారం వీరవాసరం మండలంలో పలువురిని పరామర్శించారు. మడుగు పోలవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు పొనుకు అశోక్ బాబు కుమారుడు పొనుకు సుమన్(25) ఇటీవల మరణించడంతో జొన్నలపాలెంలోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ పార్టీ మాజీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు తండ్రి కడలి సత్యనారాయణ(70) ఇటీవల మృతి చెందడంతో రాయకుదురులోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణ మూర్తి, మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందర్ రాజు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వీరవల్లి ప్రవీణ్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు కడలి శ్రీరాములు, జిల్లా బూత్ ఇంచార్జ్ డీవీడీ ప్రసాద్, పొనుకు రాజా పాల్గొన్నారు.

నేడు కల్తీ మద్యం విక్రయాలపై నిరసన

భీమవరం: కల్తీ మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు భీమవరం నియోజకవర్గ వైస్సార్‌సీపీ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం ఉద యం 10 గంటలకు రాయలం గ్రామం నుంచి ప్రదర్శనగా భీమవరంలోని ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుంటామని పార్టీ శ్రేణులు రాయలం చేరుకోవాలని వెంకటరాయుడు కోరారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వాసవీ హోమం


వాసవీ శాంతి ధాంలో వాసవీహోమం నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో ఆదిఆవారం కర్ణాటక భక్తులు వాసవీ శాంతి హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే కర్ణాటక బెంగుళూరు నుంచి వచ్చిన వాసవీ భక్తుల వాసవీ మాతకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. 102 అడుగుల రుషీ గోత్ర మందిరంలోని 92 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు సహస్రనామార్చనలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం 13 మంది దంపతులు పూజలు నిర్వహించి, యాగశాలలో వాసవీ శాంతి హోమం చేశారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బుజ్జిబాబుకు ఆర్థిక సహాయం చేస్తున్న జై భీమ్ యువసేనా ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: యలమంచిలిలంక గ్రామానికి చెందిన బత్తుల బుజ్జిబాబు కూలి పని చేసుకుంటూ, వృద్ధులైన తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొబ్బరిచెట్టు విరిగి బుజ్జిబాబు మీద పడడంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అయితే ఏడాది వరకు నడవలేడని డాక్టర్లు చెప్పడంతో ప్రస్తుతం మంచం మీదనే ఉన్నాడు. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న జై భీమ్ యువసేనా ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బుజ్జిబాబు ఇంటికి వెళ్లి తమవంతు సహాయంగా రూ.13 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గెద్దం సునీల్ గవాస్కర్, రాయపూడి భవానీ ప్రసాద్, షేక్ జానీ బాష, బద్దే రవిచంద్ర (నాని), చదమళ్ల ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వారాహి అమ్మవారి గ్రామోత్సవం


మేడపాడులో నిమజ్జనానికి బయలుదేరిన వారాహి అమ్మవారు

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని కాలనీలో దసరా శరన్నవరాత్రులు సందర్భంగా ఏర్పాటుచేసిన వారాహి అమ్మవారి విగ్రహం నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక సహిత అష్టలక్ష్ములతో ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంపై వారాహి అమ్మవారిని పెట్టి గరగల నృత్యాలు, అమ్మవారి ఘటాలు, శక్తి వేషాలు, డీజే సౌండ్స్, యువతుల డాన్సులు, బాణా సంచా కాల్పుల మధ్య అమ్మవారిని గ్రామమంతా ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం విగ్రహాన్ని దొడ్డిపట్ల తీసుకెళ్లి వశిష్ట గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని లింగనబోయిన చర్లలో ఉన్న గంగాలమ్మను ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి సారె, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.